# దొంగ

"దొంగలు, దొంగలు రక్షించండి.'

ఈ అరుపులు నల్లటి నిశీధిలో బిగ్గరగా, వికృతంగా_సన్నగా పడే తుంపర్లతో కలిసి_అప్పుడే కునుకుతీస్తున్న ఊళ్లో వినిపించాయి_దూరంగా పొలిమేరలోవున్న తాటితోపుల దగ్గర్నించి. నలుగుర్నీ లేపుకుని మొత్తం పదిమందీకలిసి కర్రలూ లాంతర్లూ తీసుకుని పరుగులెట్టారుజనం ఆ వైపుకు. చుట్టూరా పకడ్బందీగా నిల్చుని జమాజెట్టీల్లాంటి పదిమంది కలిసి తాటితోపంతా వెదికారు. కొన్ని నిమిషాల క్రితం బిగ్గరగా వినిపించిన అరుపులూ, ఇప్పుడు యీ పదిమందీ చేస్తున్న సందడీ మినహాగా తాటితోపంతా నిశ్శబ్దంగా గంభీరగా ఉంది. ఎక్కడా మనిషిఉన్న జాడేలేదు. ఓ అరగంటసేపు గాలించి వెదకింతర్వాత వాళ్ళప్రయత్నం ఫలించింది. 'ఇదుగో ఇక్కడ!' అన్నారు మెవరో. నలుగురూ అటువైపుకు పరుగులెట్టారు.

"దొరికాడా దొంగ!"

సంతోషంతో అరిచాడు చలమయ్య. ఆయన శరీర మంతా చమటలు కారుతున్నాయి. తాటిచెట్టు చాటున పడు కునివున్న ఆకారాన్ని లేపి, నుంచోబెట్టారు. గుబురుగా పెరిగిన గడ్డం; ఎర్రగా కళ్లు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. వాళ్ళల్లో కండలుతిరిగిన మనిషి ఒకడు ముందుకు వచ్చి "ఎడా పెడా" వాయించి ఏదీ! తియ్యి!" అని అరిచాడు.

ఆ మనిషి మాట్లాడే స్థితిలో లేడు; నుంచునేస్థితిలో లేడు. తూలిపోతున్నాడు. "ఏదీ సంచి! వెదకండి. తన్నండి వెధవని!" అరిచాడు చలమయ్యగారు ఆదుర్దాగా. ఇంతలో అసలుసంగతి యెత్తారు ఎవరో! "ఇందాక అరిచింది ఎవరు? ఏమి లాక్కున్నాడు వీడు!" అన్నారు ఎవరో'

"నేనేనయ్యా. గొంతు పోల్చుకోలేదూ? అసలు సంగతిది. వినండి; నేనూ, ఇంకో పెద్దమనిషి కలిసి పట్నంనుంచి నడిచివస్తున్నాము. పాపం ఆయనదగ్గరకూడా కొంతసొమ్ముంది. నా దగ్గర ఓ నాలుగువేల దాకా వుంది. అది రంగయ్య వద్దు అమ్మిన డబ్బు. ఇద్దరమూ కలిసి ఆమాటా యీమాటా అను కుంటూ వస్తున్నాము. ఇంతలో ఈ తోపులోంచి వీడు పెద్ద కర్ర "టక టక" మని కొట్టుకుంటూ మా వైపుకి వస్తు న్నాడు. పాపం! ఆయన చాలా బలహీన మయిన వాడు...

"నువ్వెప్పుడూ యింతేనయ్యా! అద్దాంతరపుపనులు చేస్తావు. రొక్కం చేతిలో వుండికదా? తొందరగా పని తెముల్చుకొని రాకూడదూ!" అన్నాడు రంగయ్య; పైకం ఉందో లేదో నన్న ఆదుర్దాతో. "నా ఖర్మ! ఏం చెయ్యను.

ఆ మిల్లు వాళ్లు కూర్చోబెట్టి యిప్పుడు తగలడ్డారు. రోజూ
వాళ్ళకిదే అలవాటయిపోయింది" ఉస్సురన్నాడు చలమయ్య.
"ఊఁ తరవాత!" "ఏముంది! వీణ్ణి చూసేటప్పటికి ఆ పెద్ద
మనిషి బెంబేలు పడిపోయి కేకలు వేశాడు. నేనేమో అలా
కూర్చుని వీణ్ణి కనిపెడుతున్నా; మళ్ళీ యెటన్నా పారిపోతా
డేమోని. అంతే ఈ గలభాలో నా సంచి పడిపోయింది
యెక్కడో. వాడే తీసివుంటాడు. బాగా వెదకండి" ఆయా
సంగా అన్నాడు చలమయ్య

నలుగురూ కలిసి ఆ మనిషిని కిందా మీదా వెది
కారు. అతనినోరు కంపు కొడుతోంది. జేబులో చిల్లర
డబ్బులూ, బీడీకట్టా మినహాగా మరేం కనబడలేదు.

"ఇలా రండి. ఒకవేళ రోడ్డుమీద పడిపోయిందేమో
చూద్దాం!" అని చలమయ్యగారు రోడ్డుమీదికి దారితీశారు.
టార్చిలైటుపెట్టి పావుగంట వెదకగా రోడ్డుప్రక్కన చెట్ల
చాటు మొదట్లో నల్లటి సంచీ కనిపించింది. "ఈసంచీ నాది"
సంతోషంతో అరిచాడు చలమయ్యగారు.

"దానిలో నాలుగువేలుండాలి. చూడండి ఉందేమో!
టార్చిలైటుపెట్టి వెదికారు. "ఏదో కాగితాల్లో చుట్టిన కట్ట
ఉంది" అన్నాడు రాఘవులు.

"ఉందా! అమ్మయ్య బ్రతికాం!" సంతోషంగా
అన్నాడు చలమయ్య.

"ఇంతకీ ఆ పెద్దమనిషి ఏడీ? అతని సంచీ? అడిగా
రెవరో.

"ఏమో! భయపడి ఎటుపారిపోయాడో? అతని సంచీ సైకిలు కూడా యిక్కడే యెక్కడో పడివుంటుంది వెదకండి" అన్నాడు చలమయ్య.

"అతని పేరేమిటి? ఇక్కడెక్కడయినా ఉన్నాడేమో కేకేద్దాం" అన్నా రెవరో.

"అతనా? అతని పేరు రాఘవరావు, చాల మంచి వారు పాపం!" జాలిగా నిట్టూర్చాడు చలమయ్య.

నలుగురూ నాలుగు వైపులకు వెళ్ళి, బిగ్గరగా కేక వేశారు. "రాఘవరావూ!" అని. ఏమీ ఫలితంలేకపోయింది. అతని సంచీకోసం ఇంకో పావుగంటసేపు వెదికాడు చలమయ్య. ఎక్కడా ఆ మనిషిగానీ, అతని సంచీగానీకనపడలేదు. "ఒకవేళ రోడ్డువెంట పరుగెడుతూ ఎక్కడయినా పడిపోయాడేమో" అన్నాడు చలమయ్య. ఇద్దరు మనుషులు వంతెన దగ్గరికి పరిగెత్తి సైకిలుషాపువాళ్ళ్ని లేపి చెరో సైకిలూ తీసుకొని చెరోవయిపుకూ వెళ్ళారు.

మిగతా జనం దొంగని తీసుకొని ఊళ్ళోకి వెళ్ళారు తన్నుకుంటూ. ఆ దొంగ బాగా నటిస్తున్నట్టుంది, నడవలేనట్టున్నాడు. "ఊఁ ఆఁ" అనటం తప్పించి ఏమీ మాట్లాడలేనట్టున్నాడు. అంతా కచేరీకి వెళ్ళారు. దొంగని స్తంభానికి కట్టేశారు గట్టిగా.

◆ ◆ ◆

పై సంఘటన జరగటానికి ఓ గంటక్రితం, పట్నం నించి అనేక పల్లెలపక్కగా మరో బస్సుపోయే ఆ రోడ్డుమీద

భయం భయంగా, చకచకా అంగలు వేస్తున్నాడు చలమయ్య గారు. అతని చేతిలో కాకిసంచి ఉంది. అందులో వెయ్యిరూపాయల పైచిల్లర ఉంది. చలమయ్యగారు కమీషను వ్యాపారస్తుడు. అంటే ఊళ్ళో రైతులవద్దనుంచి ధాన్యంకొని అవి మిల్లులకి ఎగుమతిచేసి బస్తాకి ఇంత చొప్పున మిల్లువారు ఇచ్చే కమీషను తీసుకుంటాడు. రైతులకి రావలసి పైకం మొత్తం మిల్లు యజమానులనుంచి తెచ్చి, రైతుల కిచ్చేస్తూ వుంటాడు.

ఎన్నడూ లేనిది నేడు ఆయనకి గుబులుగుబులుగా ఉంది. ఈ మధ్యన ఈ రోడ్డుమీద దొంగతనాలు ఎక్కువయ్యాయి. కార్తీకమాసం కావటంతో పనులు తక్కువయి తిండికి మార్గంలేక ఇలా ఎగబడుతున్నారట అలగాజనం.

తన సంచీలో వున్నది యితర్లసొమ్ము. ఆ మిల్లువాళ్లు కూర్చోబెట్టి ఇప్పటికికానీ యిచ్చారుగాదు. "రిక్షా" వాడిని కదిలిద్దామా అంటే రూపాయికి తక్కువకి రానంటాడు. అయినా మధ్యలో ఆపి, వాడే డబాయించి లాక్కుంటే వాణ్ణిమాత్రం చేసేదేముంది గనుక? ఈ రోజులు ఎలువంటివంటే ఎవర్నీ నమ్మటానికి వీలులేదు. చకచకా నడక సాగించాడు చలమయ్యగారు. గుండెలు బిగబట్టుకొని ఒక పల్లె దాటాడు. ఇంకో రెండు పల్లెలుదాటితే తాటితోపు వస్తుంది. తాటితోపు జ్ఞాపకంవచ్చేసరికి చలమయ్యగారి గుండెలు భిగులు భిగులు మన్నాయి. ఆ ఒక్క గండం గడిచిందంటే తనకేం ఫరవావేదు. ఇవాల్టికి బయటపడ్డట్టే.

పల్లెలో దూరంగాదీపాలుమినుకుమినుకుమంటున్నాయి. ఊరు నూటుమణుగుతోంది. రోడ్డంతానిర్మానుష్యంగా ఉంది. ఎక్కడా అలికిడిలేదు. రోడ్డుప్రక్కన కాలవగట్టున చెట్లు దయ్యాల్లా నిలబడివున్నాయి చీకట్లో.

"చలమయ్యగారు చకచకా అడుగువేస్తున్నారు. ఇంకో పల్లెటూరు ఆయన. ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న చలమయ్యగారు ఓ అరఫర్లాంగు దూరంలో తెల్లగా ఏదోచూసి గతుక్కుమన్నారు. కొంపదీసి దయ్యం కాదుగద! చలమయ్యగారికి దయ్యాలంటే నమ్మకంలేదు. అందుకనే మొండి ధైర్యంతో నడిచాడు.

"ఎవరది?" అటువయిపునుంచి వినిపించింది.

"నేను చలమయ్యని. మాది పాలెం, మీా రెవరు?" అన్నాడు చలమయ్య.

"నా పేరు రాఘవరావు. మాది బస్తీ. కలపవ్యాపారం చేస్తుంటాను. ప్రక్కపల్లెలో కొంత పైకం రావల్సి ఉంటే అది వసూలుచేసుకుని వస్తూంటే వెనుక టైరులో గాలి పోయింది; రాత్రిపూట అడవిలో చిక్కుపడ్డాను. ఎలారా భగవంతుడా అనుకుంటూ బికుబిక్కుమంటూ ఉన్నాను. ఇంతలో దేవుడులా మీారు వచ్చారు" అన్నాడురాఘవరావు.

చలమయ్యగారు సంతోషంగా నవ్వారు. "దానికేమి లెండి. ఒకరి కొకరు తోడు. మా ఊరుదగ్గిర సైకిలుదుకాణం

ఉంది గాలికొట్టుకొని వెళ్ళవచ్చు. ఇక్కడికి ఇంకా అయిదు మైళ్లు ఉంటుంది. లేకపోతే ఈ రాత్రికి మా ఊళ్ళోఉండి..."

"లేదండీ, పైకం చేతిలో ఉంది. అర్జంటుగా వెళ్ళాలి. సేటువచ్చి కూర్చుంటాడు" అన్నాడు రాఘవరావు.

చలమయ్య రాఘవరావుని పరీక్షగా చూశాడు. వర్షం చినుకులకి నానిన ఇస్త్రీబట్టలు చీకట్లో తెల్లగా మెరుస్తున్నాయి. మనిషి బెదురుగా ఉన్నాడు. చేతికి వాచీ మెరుస్తోంది. నల్లరంగు సంచీ చేతికిమెలిపెట్టి చుట్టగాపట్టుకున్నాడు. బహుశా అందులోనే పైకం ఉండి వుండాలి. కుర్రవాడులా వున్నాడు. అప్పుడే వ్యాపారం చేస్తున్నాడు.

"సరేలెండి, అలాగే వెళుదురుగాని, మీ కంపెనీ పేరేమిటి?" అన్నాడు చలమయ్య.

"చూడండీ! 'మోడరన్ టింబర్స్' అని ఈ మధ్యనే నలుగురం కలిసి రెండు లక్షలుపెట్టి పెట్టాము. బస్తీలో మీ రెప్పుడూ చూడలేదా?..."

"లేకండీ, మే మెప్పుడూ పట్నం వెళతాము దేనికైనా, దగ్గరకదా!" అన్నాడు చలమయ్య.

ఇద్దరూ కలిసి నడక సాగించారు.

నిశ్శబ్దాన్ని మింగేయడానికి ఇద్దరూ ఆ కబురూ ఈ కబురూ చెప్పుకున్నారు. కలప వ్యాపారంనుంచి కమీషను వ్యాపారం వరకూ, మార్కెట్ 'అప్పూ' 'డౌనూ' అదీ ఇదీ మాట్లాడుకున్నారు. అలా మాట్లాడుకుంటూ ఇద్దరూ మరో పల్లె దాటారు.

"తరువాత వచ్చేదేగా మీ పల్లె?" అన్నాడు రాఘవ రావు.

"అవును. ఇంకో మూడుమైళ్లు నడిచామా, మా ఊరు వచ్చేస్తుంది.

"అయినా ఇంత రాత్రివేళ బస్తీ చేరాలంటే _ ఎలా వెడతారండీ? పైగా పైకం ఉందంటున్నారు? అందులోనూ దొంగల భయాలూ ఎక్కువయాయి. ఈ మధ్య యీ రోడ్డు మీద" అన్నాడు చలమయ్య.

"అవునండీ, ఏం చేయను? పరిస్థితి, ఇలా తారుమా రయింది ఈ రోజు. ఇవ్వవల్సిన ఆయన అక్కడా యిక్కడా చూసి యిప్పటికి తెమిల్చాడు. అక్కడ 'సేటు'కి పాతిక వేలు యివ్వాలి. అతను వచ్చికూర్చునిఉంటాడు. ఈయనకి నాలుగు వేలు సర్దేటప్పటికి ప్రళయమయిపోయింది. ఈ నాలుగువేలు గాక యింకో రెండువేలు కలిపితేగాని పాతిక వేలవదు. ఛీ! ఛీ ఈ వ్యాపారమంత చండాలపు వ్యాపారం మరోటి లేదండీ" అన్నాడు రాఘవరావు.

"అవును దశ యెత్తుకుంటే ఆకాశానికి, లేకపోతే పాతాళానికి. ఈ బిజినెస్సులే అంత" అన్నాడు చలమయ్య.

"కొత్తవాణ్ణి. పైగా ఈ రోడ్డున దొంగల భయం అంటున్నారు. ఎలా...? నేనీ రాత్రికి బస్తీ తప్పక చేరాలి" భయపడ్డాడు రాఘవరావు.

"ఈ రోడ్డున దొంగతనాలు ఇప్పుడే కాదండి. నా చిన్నతనంనుంచి జరిగాయి. చాలా విచిత్రంగా జరిగాయి చెప్ప మంటారా?" అన్నాడు చలమయ్య.

“నా చిన్నతనంలో ప్రొద్దుగూకిందంటే ఈ రోడ్డున నడవటానికి భయపడేవారు జనం. అప్పటికి మట్టిరోడ్డులెండి” ఎప్పుడయినా “బొమ్మ” చూడటానికి పట్నం బయలుదేరితే, పదిబళ్ళు చేసుకుని గాని బయలుదేరేవారం కాదు. ముందూ వెనకా మొగవాళ్ళు కూర్చున్న బళ్ళుండేవి. వెనక యిద్దరూ ‘ముందు’ యిద్దరూ నడుస్తుండేవాళ్లు. అప్పటికీ ఏదో ఒకటి పోతూనేవుండేది. వాళ్ళ దుంపదెగ! ఏం దొంగలండీ వాళ్లు_ దొంగలంటే వాళ్ళనే చెప్పాలి. సైకిళ్ళమీదవచ్చి ఈలలు వేసుకుంటూ తిరిగేవారు. క్షణంలో అంతా అయిపోయేది ప్లాను ప్రకారం.”

“మనుషులు ఎలా వుండేవాళ్ళో తెలుసా! ఒళ్ళంతా ఆముదం పూసుకొని మొహానికి మసిరాసుకొని, తలకి ఎర్రటి గుడ్డ సుట్టుకొని. తళతళలాడేది కత్తి! అబ్బ! వాళ్ళని తలుసుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తోంది సుమండీ! ఈ కాలంలో ఎక్కడండీ అటువంటి దొంగలు!”

“అన్నట్టు మరిచాను. ఒకసారేమయిందో తెలుసా? అప్పుడు నేను కొత్తగా కమీషను వ్యాపారంలో ప్రవేశించిన రోజులు. ఒకరాత్రి ఇలాగే వస్తున్నాను. అప్పుడు మొండి ధైర్యం ఉండేదిలెండి. శరీరంమాత్రం! ఇప్పుడంటే జారిపోయాయి గాని, నా కండరాలు, వయసులో ఎలాతిరిగి వుండేవనుకున్నారు...?”

“ఏం? మాట్లాడటంలేదు? భయపడుతున్నారా? ఊరికే పొద్దుపోతుందని అంతే. పోనీ ఆపమంటారా?...వద్దా! అయితే వినండి.”

"అప్పుడేమయిందో తెలుసా ! అదిగో చూశారా ! తాటితోపు. అక్కడికి వచ్చాను. ఈ టయిముకు సరిగ్గా ఇలాగే జెమాజెట్టిలాంటి నలుగురు దొంగలు బాణాకర్రలతో దగ్గిరికి వస్తున్నారు. అప్పుడు నే నేంచేశాననుకున్నారు?

"వెనక్కితిరిగి పరిగెత్తారా?" "ఛా...ఛా! ఆంత పరిగెత్తలేనిది వాళ్ళేనా? ఇల్లాగే (అని నాలుకకొరుక్కున్నాడు) అలప్పుడూరొక్కంవుంది నా దగ్గర, వాళ్ళ రాకని పసిగట్టి నేను ఆ డబ్బు సంచీని మెల్లిగా చెట్టు మొదట్లోవిడిచి, వాళ్ళని చూడనట్లు నటిస్తూ మెల్లిగా నడవసాగాను. ఆ నలుగురూ నన్ను చుట్టుముట్టారు. నా జేబులు వెతికిచూశారు. కోపం వచ్చి వాళ్ళలో ఒకరు నన్ను చెంపమీద కొట్టాడు. అప్పుడు నాకు భలే కోపంవచ్చింది. నలుగుర్నీ చితకబాదుద్దా మనుకొన్నాను. కాని అందువలన లాభం ఏమిటి?... మెదలకుండా ఊరుకున్నాను. ఎందుకు? అందువలన నాలుగు తిన్నటంతప్ప లాభంలేదు. నేనేం చేశాననుకున్నారు? అమాంతం ఓ పిచ్చికేక వేసి మొదలునరికిన చెట్టులాపడిపోయాను. వాళ్లు ఖంగారు పడ్డారు నేను చచ్చిపోయానేమోనని. గబగబా పరిగెత్తి పారిపోయారు యెవరయినా చూస్తారేమోనని. అప్పుడు నేను మెల్లిగా జారవిడిచిన నా సంచీ తీసుకుని చక్కావచ్చేశాను. ఎలా ఉందంటారు?" చలమయ్య గర్వంగాచూశాడు రాఘవ రావువంక.

మాటల సందడిలో చలమయ్య గమనించలేదుగాని వాళ్ళిద్దరూ తాటితోపువద్దకు వచ్చారు. రాఘవరావు వణికి పోతున్నాడు? చలమయ్య పట్టుకుని ఆపి వేలితో చూపిం

చూడు. తాటితోపులో చెట్లచాటున అగ్గిపుల్ల వెలిగి ఆరిపోయింది. "చూశారా! దొంగలు?" అన్నాడు రాఘవరావు.

చలమయ్య ఎంత తమాయించుకున్నా ఒణుకు ఆగడంలేదు.

"ద్...ద్ దొంగలే..." కళ్లు తేలేశాడు చలమయ్య బురదలో కాళ్లు ధబ్ ధబ్ మని చప్పుడయింది. సందేహంలేదు. ఒకరుకాదు_ముగ్గురు యిటే వస్తున్నారు. చలమయ్య రాఘవరావుని కావిలించుకుని గజగజ వణికిపోయాడు.

"ఇదిగోండి నా సంచీ, రెండూకలిపి తొందరగా దాయండి. వాళ్ళు వచ్చేస్తున్నారు" రాఘవరావు అన్నాడు. చలమయ్య వణుకుతూ రెండు సంచులూకలిపి చెట్టుమొదట్లో గిరవాటు వేశాడు.

"వాళ్లు వచ్చేస్తున్నారు చేతుల్లో అయ్యబాబోయ్! కత్తులు చూడండి! తళతళ మెరుస్తున్నాయి. చూశారా! ఇహ లాభంలేదు. పదండి పరుగెడదాం. ఈ చీకట్లో మనిద్దర్నీ ఖూనీచేస్తే దిక్కెవరు?" రాఘవరావు అంటూండగానే చలమయ్య అతన్ని ఒదిలిపెట్టి కాలికొద్దీ పరుగెత్తాడు. ఇలా నాలుగునిమిషాలు పరిగెత్తాక, అతనికి తన సంచీ జ్ఞాపకం వచ్చింది. వెంటనే పిచ్చిగా అరిచాడు "దొంగలు! దొంగలు రక్షించండి" అని.

తన వెనకాల ఏంజరిగినదీ అతనికి తెలియదు. అసలు దొంగలు తళతళ మెరిసే కత్తులతో తనవైపు వచ్చిందీ, లేనిదీ అతను చూడలేదు. అయితే ఒకటి చీకట్లో తాటితోపులో వెలిగిన అగ్గిపుల్లను మాత్రం కళ్ళారా చూశాడు. ఇంకా సందేహం ఎందుకు?

ఇదీ అసలు జరిగిన సంగతి. కచ్చేరిలోదొంగని స్థంభా నికి కట్టి నలుగురూ బాదుతున్నారు. ఎవరి ఓపికకొద్దీ వాళ్లు కొడుతున్నారు.

చలమయ్యకి ఈ సంగతి పట్టలేదు. తను అనుకున్నట్టు గానే ఆ హడావిడిలో అతను తన నల్లసంచీ వదిలిపెట్టి తన కాకీసంచీ పట్టుకెళ్ళాడు. అయితే అతను యేమయినట్టు? పారి పోతూ భయంకొద్దీ గుండెలుపగిలి వుండొచ్చు. ఏ చెట్టుకో గుద్దుకొని తలపగిలి ఉండొచ్చు. లేక... అది ఎవడికి కావాలి? అతని సంచీ ప్రస్తుతం తనది అయింది. తన సంచీలోని వెయ్యి రూపాయలు పోగా, నాలుగువేలలో నికరలాభం మూడు వేలు, నల్లసంచీ! అవును, అదే! అందులో పెద్దనోట్లకట్ట!

లాంతరు వెల్తురులో చూశాడు చలమయ్య సంచీ తెరిచి. అవును, నోట్లకట్టలే, అన్నీ పదిరూపాయలనోట్లు. అయినా ఉండబట్టలేక కట్టకి ఎన్నినోట్లో లెక్కబెట్టబోయాడు చలమయ్య...!? అంతే తెల్లమొహంవేశాడు. పైనమాత్రం రెండు మామూలు నోట్లువుంచి, మధ్యన అన్నీ తెల్లకాగితాలు పెట్టి చక్కగా కట్టారు. ఓ నిముషంసేపు అతని నవనాడులూ స్తంభించాయి. చలమయ్య అలాగే స్తంభానికి చేరగిల బడ్డాడు.

కాస్సేపటికి సైకిళ్ళమీద వెళ్ళినవాళ్ళు రొప్పుకుంటూ తిరిగివచ్చారు. బస్తీవైపుకి వెళ్ళినతనికి యెవరూ కనపడలేదు. విచారించగా యెవరూ ఆ దారిన వెళ్ళినట్టు చెప్పలేదు. పట్నంవైపు వెళ్ళిన సుబ్బారావు కథనం ఇది:

అతనికి రోడ్డుమీద మనిషిగాని, సైకిలుగాని కనబడ లేదు. పట్టణ శివార్లలో టీ కొట్టతన్ని అడిగితే, ఈ వయిపు నుంచి ఓ అరగంటక్రితం ఓ తెల్లబట్టల ఆసామీ సైకిలుమీద పట్నంలోకి వెళ్ళినట్టు చెప్పాడు. యే సందుకి వెళ్ళాడో, యే యింట్లో దూరాడో..." అని సుబ్బారావు చెబుతోంటే చలమయ్య ఆశ్చర్యపోయాడు. కోపంతో ఒణికాడు నిస్సహాయుడై అంత చలిలోనూ చమటలు క్రక్కాడు.

స్తంభానికి కట్టేసిన దొంగకి దెబ్బలతో మైకందిగిపోయింది. అతనివద్దనుంచి రాబట్టిన సమాచారం ఇది:

"అతని పేరు సుబ్బడు. ప్రక్క ఊరు వాస్తవ్యుడు. అతనికి తాగుడు అలవాటువుంది. ప్రక్క వూరికివెళ్ళి త్రాగి వస్తూ త్రోవలో స్మృతితప్పి పడిపోయాడు. కాస్సేపటికి లేచి అగ్గిపుల్ల వెలిగించి బీడీ ముట్టించుకున్నాడు. తరువాత అతనికి ఏవో కేకలు వినపడ్డాయి. కాని మత్తులో అతను ఏమీపట్టించుకొనలేదు. ఆ తరువాత కర్రలూ, లాంతరూ, మనుషులూ అంతకుమించి తనకేమీ తెలియదు."

"ఇంతకీ లెక్క సరిపోయిందా?" రంగయ్య పరామర్శించాడు చలమయ్యని. చలమయ్య ఏమీ మాట్లాడ లేదు.

"భలేగా వుంది, ఇంతకీ వాళ్ళవ్యాపారం ఏమన్నావూ? కలపవ్యాపారమా? బస్సీలోనా? అయితే మన రంగారావుకి తెలిసుండాలి. కంపెనీ పేరేమిటి?" అన్నారు మునసబుగారు అప్పుడే ఆ విషయం తెలిసి.

"మోడరన్ టింబర్స్" అన్నాడు చలమయ్యగారు బరువుగా.

"నేను నిన్నేగదా బస్తీనుంచి వచ్చింది. బస్తీలో అలాంటి "అడితీ" ఎక్కడా పెట్టలేదు ఈ మధ్యన." అన్నాడు రంగారావు. ఉన్న చివరి ఆశ కాస్తా ఊడిపోయింది చలమయ్యకి.

నిరాశగా "మోసం జరిగింది" అన్నాడు చలమయ్య ఆ మోసం ఏమిటో ఎవరికీ అర్థంకాలేదు.

దొంగని నిలదీసి గట్టిగా అడుగుతున్నారు. విపరీతంగా కొడుతున్నారు. అతను బాధ భరించలేక కూలిపోయాడు. "ఆగండి" అన్నాడు చలమయ్య. గబగబా వెళ్ళి అతని కాళ్ళకీ, చేతులకీ వున్న కట్లు విడదీశాడు. అతను చేసిన ఈ పనికి అందరూ ఆశ్చర్యపడిపోయారు.